

వారికి ఇంగ్లీషు, తెలుగు భాషలపై వున్న పట్టు, అభిమానము ఒనర్చిన కృషి ఈనాటి తరాలవారికి ఊహకు కూడా అందకపోవచ్చు

# నాకు తెలిసిన శ్రీమాన్ ఎలవర్తి రోశయ్య


శ్రీ యస్. కోటేశ్వరరావు,

Former Lecturer in Zoology, J.K.C.College


శ్రీమాన్ ఎలవర్తి రోశయ్యగారితో నా తొలి పరిచయం 1958వ సంవత్సరంలో నేను P.U.C. చదువుతూ గుంటూరు కమ్మ హాస్టల్‌లో ఉంటునప్పుడు, వారు ఆ హాస్టల్ వార్డెన్‌గా ఉండెడివారు. అంతకు ముందు సంవత్సరములలో నాకన్నా ముందు కాలేజిలో చదివెడి విద్యార్థులు మా స్వగ్రామమైన కొప్పర్రులో పిచ్చాపాటిగా మాట్లాడుకొనేటప్పుడు ఎక్కువ సమయం రోశయ్య గారిని గురించి చెప్పుకొనేవారు. అది గమనిస్తున్న నాలాంటి విద్యార్థులకు, ఆ రోశయ్య గారిని ఎప్పుడు చూద్దామా అనే ఉత్సుకత కలిగేది.

నేను ఇటు కమ్మ హాస్టల్‌లో ఉంటూ అటు A.C. కళాశాలలో విద్యార్థిగా చదువుతూ, వారిని వార్డెన్‌గాను, అధ్యాపకునిగాను చాలా దగ్గరగా గమనించే అవకాశమురావటం నా అదృష్టంగా ఇప్పటికీ భావించుచున్నాను.

1958వ సంవత్సరము నుండి వారు గతించిన 1991వ సంవత్సరము వరకు వారు నాకు దైవ సమానులు. ఈ 34 సంవత్సరముల కాలములో వారు

నాకు వార్డెన్‌గా హాస్టల్‌యందు, అధ్యాపకులుగా గుంటూరు ఏ.సి. కాలేజినందు, 1964 నుండి 1968 వరకు గుంటూరు ఏ.సి. కాలేజిలో సహచరుడిగాను, 1968 నుండి 1976 వరకు వారు జే.కే.సి. కాలేజి ప్రిన్సిపాల్‌గాను, నేను అధ్యాపకునిగాను పనిచేసే భాగ్యం ఒక అరుదైన అవకాశముగా, అదృష్టంగా భావిస్తున్నాను. వారు పదవీ విరమణ చేసిన 1976 సంవత్సరము నుండి, మృతి చెందిన 1991వ సంవత్సరము వరకు వారితో సాన్నిహిత్యం నాజీవితంలో ఒక భాగం. మా ఇద్దరి మధ్య ఉన్నటువంటి దీర్ఘకాలపు పరిచయం వలన వారి ప్రభావము కొంత వరకైనా నాకు తెలియకుండానే నాపై పడినదని నేను భావించుచున్నాను.

ఒక్కసారి గతాన్ని అవలోకించుకుంటే, వారి వేషధారణ, ఆహారపు వ్యవహారాలు, అలవాట్లు, రుచులు, అభిరుచులు ఇప్పటికీ నా మదిలో స్పష్టమైన రూపాన్ని సంతరించుకునే ఉన్నాయి. పాత, క్రొత్త కాని సైకిలు, దానివెనుక క్యారియర్ పైన తాడుతో బిగించిన మాక్మిలన్ కంపెనీ పుస్తకాలు, కాటన్ దుస్తులు, పైన కోటు, మెడలో టై, ఒక కోటు జేబులో చిల్లర డబ్బులు, మరియొక జేబులో చాక్‌లేట్లు. ఈ విధమైన హంగామాతో ఏ.సి. కళాశాలకు వెళ్ళేటప్పుడు వారితో పరిచయమున్న ప్రజలలో కొంతమంది పోలీసువారు సైతం ఈయనను ఒక వింత మనిషిగా భావించేవారు. రోడ్డుపై ప్రయాణపు నిబంధనలను ఖచ్చితముగా పాటించుతూ, అవసరము అయినపుడు పోలీసు వారికి హెచ్చరికలు కూడా చేస్తుండెడివారు. ఇంటికి వచ్చేటప్పుడు ఓవరు బ్రిడ్జి ప్రక్కన లభ్యమయ్యే వేపపుల్లలు ఒక కోటు జేబులోను, మరియు మల్లెపూలు మరియొక కోటు జేబులోను ఉండుట సర్వసాధారణం.

కమ్మ హాస్టలు వార్డెన్‌గా పనిచేసేటప్పుడు వారి నివాసము హాస్టల్‌కు అతిసమీపముగా అరండల్‌పేట 6వ లైనునందు ఉండెడిది. ఎప్పుడు సమయము దొరికినను, ముఖ్యముగా శెలవు రోజులలోన వారు మంచాన్ని నాలుగు దిండులను హాస్టల్‌కు చేర్చి గంటల తరబడి విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామరు బోధిస్తూ ఉండేవారు. హాస్టల్‌కు

మంచము రావటాన్ని గమనించిన కొందరు విద్యార్థులు ఆరోజు భోజనము చేయకుండా కూడా పారిపోయేవారు. హాస్టల్‌లో గదిగదిని పరిశీలించుచూ గదిలోపల గైడ్లు ఉన్ననూ, తక్కువ స్థాయి అచ్చు పుస్తకములు ఉన్ననూ వాటిని రోడ్డుపైకి విసురుతూ తన దగ్గర ఉన్న పుస్తకాలను పంచుతూ ఉండేవారు.

శ్రీ రోశయ్యగారు భోజనప్రియులు. ప్రతి విషయములోను నాణ్యమైన సరుకుకే ప్రాధాన్యతనిస్తూ హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య సూక్తులను బోధించుచూ తాను కూడా అప్పుడప్పుడు హాస్టల్ యందే భోంచేస్తూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని కలుగ జేస్తూ ఉండేవారు.

ఇక కళాశాలలో సహ అధ్యాపకులకు ముఖ్యముగా తెలుగు, ఇంగ్లీషువారికి, విద్యార్థులకు సింహస్వప్నం. తరగతి గదిలోనికి ప్రవేశించిన తరువాత సమయపాలన పాటించక పోవటం అతి సామాన్య విషయం. Milton's 'Paradise Lost' బోధించేటప్పుడు వారు ప్రదర్శించే హావభావాలు, నవరసాలు ప్రత్యక్షముగా అనుభవించిన వారికి మాత్రమే తెలుస్తుంది. వారికి ఒంటిపై బట్టలు ఉండుట ఎంత సహజమో. అదే విధముగా వారి చేతిలో Oxford Dictionary మరియు Oxford Atlasను కలిగివుండుట అంతే సహజము.

వారికి ఇంగీషు, తెలుగు భాషలపై ఉన్న పట్టు, అభిమానము ఒనర్చిన కృషి ఈనాటి తరాల వారికి ఊహకు కూడా అందక పోవచ్చు. వారు శుద్ధ గ్రాంధికవాది. వ్యవహారిక భాషా వ్యతిరేకి. వారు అభిమానించేటటువంటి పురాతన కవులపట్ల ఉన్న మమకారము వారి కుమారుల పేర్లను పరిశీలించిన తేటతెల్లమగును.

మొదటి కుమారుడు: చిన్నయసూరి

రెండవ కుమారుడు: దేవరాజ సుధీమణి

మూడవ కుమారుడు: రామరాజ భూషణుడు

నాలుగవ కుమారుడు: అప్పాజి

అయిదవ కుమారుడు: నన్నెచోడదేవవర్మ

నన్నయ, తిక్కన, చిన్నయసూరివంటి పురాతన కవులపై ఎంత గౌరవ భావముండెడిదో అంతే గౌరవ భావము ఈ తరానికి చెందిన ప్రముఖ పండితులు శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారిపై ఉండెడిది. ఆ రోజులలో శ్రీ తుమ్మలవారు తరచు కమ్మ హాస్టల్‌కు రావటం, సాహిత్య గోష్ఠులు జరగటం చాలా ఎక్కువగా ఉండెడిది. వారు ఎక్కువగా అభిమానించిన తెలుగు పుస్తకాలు పానుగంటివారి సాక్షి, చిన్నయసూరిగారి బాల వ్యాకరణము, ప్రౌఢ వ్యాకరణము, నీతి చంద్రిక వంటి ఆధునిక తెలుగు గ్రంథములు. వారి ఇంగ్లీషు భాషాభిమానాన్ని పాండిత్యాన్ని ఉదహరించే స్థాయి మాత్రం నాకు లేదు.

రోశయ్యగారికి రాజకీయాలపై అంతగా శ్రద్ధ లేనట్లు కనిపించినప్పటికీ, శ్రీయన్.జి. రంగా గారు చిత్తూరు లోక్‌సభ నియోజక వర్గము నుండి పార్లమెంట్‌కు గెలిచినప్పుడు వారు చేసిన ఆర్భాటము గమనించిన వారికి వారిలో అంతర్లీనముగా రాజకీయాలపైన మక్కువ గాని, లేక రంగాగారిపైన అభిమానమో ఉండి ఉండవచ్చును అనిపిస్తుంది. వారు అతిగా ప్రేమించే సూక్తి ''Do as you would be done by''.

కమ్మ హాస్టల్‌వార్డెన్‌గా, జె.కె.సి. కళాశాల ప్రిన్సిపాల్‌గా పరిపాలన నిర్వహించేటప్పుడు, వారిలో నేను గమనించిన విశేషము తన దగ్గర పనిచేసే ఉద్యోగుల అందరి పుట్టు పూర్వోత్తరాలు, 80% మంది విద్యార్థుల ఇంటిపేరుతో సహా ఇతర వివరములను అలవోకగా పిలుచుటయే గాక, కొన్ని సంవత్సరముల తరువాత కూడా పాత విద్యార్థులు తారసపడినప్పుడు వారి పూర్తి వివరాలను చెప్పగలిగేటంత జ్ఞాపకశక్తి వారికి ఉండేది. ఏ వ్యక్తి అయినా ఒక పదవిలో ఉంటూ దాని ధర్మాన్నిపూర్తిగా నిర్వర్తించవలెనంటే తనకు సంబంధము కలిగిన వ్యక్తులలో 80% మందిని మాత్రమైనను ఇంటిపేరుతో సహాపిలువగలిగినపుడే వారిపై పట్టు సాధించవచ్చును అనే ధృడ సంకల్పమును కలిగి ఉండెడివారు.